క్లుప్తంగా

పాలవలసలో అన్న సమారాధన



అన్నదానంలో పాల్గొన్న భక్తులు

గుర్ల: మండలంలోని పాలవలసలో వినాయక చవితి నవరాత్రుల సందర్భంగా రేస్ యూత్ ఆధ్వర్యంలో సోమవారం అన్న సమారాధన నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్య పాల్గొని స్వామి ప్రసాదం స్వీకరించారు. కార్యక్రమంలో సుమారు మూడు వేల మంది భక్తులు పాల్గొన్నారు.

తెలుగు అధ్యాపకుడికి ప్రతిభా అవార్డు



సర్వేపల్లి జాతీయ ప్రతిభా అవార్డు పొందుతున్న విజయేశ్వరరావు

చీపురుపల్లి: పట్టణంలోని ప్రభుత్వ ఆదర్శ డిగ్రీ కళాశాలలో తెలుగు అధ్యాపకునిగా పని చేస్తున్న డాక్టర్ బి.విజయేశ్వరరావుకు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ జాతీయ ప్రతిభా అవార్డు పురస్కారం లభించింది. నంధ్యాలకు చెందిన సదరన్ ప్రైవేట్ లెక్చరర్స్ టీచర్స్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ప్రతి ఏటా ఉపాధ్యాయుల దినోత్సవం సందర్భంగా ఈ అవార్డులు ప్రదానం చేస్తున్నారు. అందులో భాగంగానే విజయేశ్వరరావు తెలుగు అధ్యాపకుడిగా, ఎన్ఎస్ఎస్ పీఓగా అందిస్తున్న సేవలకు గాను ఆయన్ను ఎంపిక చేశారు. ఈ మేరకు అవార్డు పొందిన ఆయన్ను స్థానిక కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ రమేష్ కుమార్, అధ్యాపకులు, సిబ్బంది అభినందించారు.

శంకుస్థాపన



గజపతినగరంలో అన్న క్యాంటీన్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్

గజపతినగరం: మండల కేంద్రంలో అన్న క్యాంటీన్ నిర్మాణానికి మంత్రి కొండపల్లి శ్రీనివాస్ సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదలకు ఐదు రూపాయలకే అల్పాహారం, భోజనం అందిస్తామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా కొత్తగా 67 మేజర్ పంచాయతీలకు అన్న క్యాంటీన్లు మంజూరు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ పీవీవీ గోపాలరాజు, కొండపల్లి భాస్కరనాయుడు, మక్కువ శ్రీధర్, ప్రదీప్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎల్ఐసీ ఆవిర్భావ దినోత్సవం



ఎల్ఐసీ కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న బీఎం రాజు

శృంగవరపుకోట: పట్టణంలోని ఎల్ఐసీ కార్యాలయంలో భారతీయ జీవిత భీమా సంస్థ 69వ ఆవిర్భావ దినోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీఎం రాజు మాట్లాడుతూ.. వారం రోజుల పాటు వారోత్సవాలు నిర్వహిస్తామన్నారు. స్థానిక యూనియన్ బ్యాంక్ మేనేజర్ సురేంద్రరావు మాట్లాడుతూ.. 1956 నుంచి ఎల్ఐసీ ఖాతాదారులకు మెరుగైన సేవలందిస్తోందన్నారు. కార్యక్రమంలో ఎల్ఐసీ సిబ్బంది పాల్గొన్నారు.

గరివిడిలో..

చీపురుపల్లి రూరల్ (గరివిడి): భారతీయ జీవిత బీమా సంస్థ 69వ ఆవిర్భావ దినోత్సవాన్ని గరివిడి బ్రాంచ్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన చీపురుపల్లి డీఎస్పీ ఎస్. రాఘవులు మాట్లాడుతూ.. ఎల్ఐసీ కోట్లాది కుటుంబాలకు భద్రత కల్పిస్తుందన్నారు. కార్యక్రమంలో సీఐ జి.శంకరరావు, బీఎం. బి.వెంకటకుమార్, క్లాస్ వన్ ప్రతినిధుల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

జీతాలు పెంచండి



జీతాలు పెంచాలని కోరుతున్న ఆయాలు

మెరకముడిదాం: తమకు ప్రభుత్వం ఇస్తున్న వేతనాలు కుటుంబ పోషణకు సరిపోవడం లేదని, జీతాలు పెంచేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న పలువురు ఆయాలు కోరారు. ఈమేరకు జిల్లా కేంద్రంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌సెల్‌లో ఫిర్యాదు చేశారు. లేబర్ యాక్ట్ ప్రకారం తమకు రూ. 18 వేల నుంచి 20 వేల రూపాయల వేతనం ఇవ్వాలని కోరారు.

పరిశీలన

వేపాడ: మండలంలోని సోంపురం గ్రామంలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని ఎంపీడీఓ సీహెచ్ సూర్యనారాయణ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా తడి, పొడి చెత్త వేరు చేయడం.. సంపద సృష్టించడంపై అవగాహన కల్పించారు.

నిర్మాణాల ఊసెత్తడం లేదు..

- గత ప్రభుత్వంలో రూ. 8.25 కోట్లతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు నూతన భవనాలు మంజూరు
- శరవేగంగా సాగిన నిర్మాణాలు
- ప్రభుత్వం మారడంతో ఆగిన పనులు
- పట్టించుకోని కూటమి ప్రభుత్వం



అర్ధంతరంగా నిలిచిపోయిన కొత్తవలస పీహెచ్‌సీ భవనం



90 శాతానికి పైగా పూర్తయిన ఎల్.కోట పీహెచ్‌సీ భవనం

కొత్తవలస: ప్రజారోగ్యానికి గత ప్రభుత్వం పెద్దపీట వేసింది. ఇందులో భాగంగా నియోజకవర్గ పరిధిలో నాడు – నేడు కార్యక్రమంలో భాగంగా తొమ్మిది పీహెచ్‌సీలకు రూ 8.25 కోట్లతో నూతన భవనాలను మంజూరు చేసింది. నిధులు మంజూరైన వెంటనే పనులు శరవేగంగా సాగాయి. ఇరుకు గదులు, పురాతన భవనాల్లో కాలం వెల్లదీస్తున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు కొత్త శోభ తీసుకువచ్చేందుకు అధికారులు, పాలకులు ముందుకు సాగారు. కొత్త భవనాల్లోకి మారుతామని సిబ్బంది కూడా ఎంతో సంతోషించారు. అయితే వారి ఆశలు అడియాశలయ్యాయి. నిర్మాణాలు జోరుగా సాగుతున్న తరుణంలో ఎన్నికల కోడ్ రావడం.. ఆ తర్వాత ప్రభుత్వం మారడంతో ఎక్కడిపనులు అక్కడే నిలిచిపోయాయి. కూటమి ప్రభుత్వం కొలువుదీరాక కూడా భవన నిర్మాణాల వైపు కన్నెత్తి చూడకపోవడం బాధాకరం.

కొత్త భవనాలు..

నియోజకవర్గ పరిధిలో 9 పీహెచ్‌సీ కేంద్రాలున్నాయి. ఇందులో జామి, అలమండ, లక్కవరపుకోట, కొత్తవలస, వియ్యంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల భవనాలు పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్నాయి. దీంతో గత ప్రభుత్వంలో అప్పటి ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు చొరవతో ఐదు పీహెచ్‌సీలకు నూతన భవనాలు మంజూరయ్యాయి. జామి, లక్కవరపుకోట పీహెచ్‌సీ భవనాల పనులు 90 శాతం పూర్తయ్యాయి. పెయింటింగ్ పనులు సైతం పూర్తయ్యాయి. కేవలం ప్లంబింగ్, ఎలక్ట్రికల్ పనులు మాత్రమే మిగిలి ఉన్నాయి. అలమండ, వియ్యంపేట, కొత్తవలస పీహెచ్‌సీ భవనాల పనులు కూడా 70 శాతానికి పైగా పూర్తయినా వాటిని పూర్తిచేయాలన్న ధ్యాస కూటమి ప్రభుత్వానికి లేకపోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

రోగులకు తప్పని అవస్థలు..

పీహెచ్‌సీ భవనాలు ఇరుకుగా ఉండడం.. శిథిలావస్థకు చేరుకోవడంతో రోగులకు ఇబ్బందులు తప్పడం లేదు. చీకట్లలో రోగులకు సేవలందిస్తున్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం స్పందించి భవన నిర్మాణాలు పూర్తి చేసి రోగులకు మెరుగైన సేవలందేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

పూర్తి చేయాలి..



భవనాలు పూర్తి చేస్తే గత ప్రభుత్వానికి మంచిపేరు వస్తోందనో.. లేక మరే కారణమో తెలియదు గాని ప్రస్తుత ప్రభుత్వం భవన నిర్మాణాల జోలికి పోవడం లేదు. దీంతో ఆరుబయట, చీకటిలో వైద్యులు సేవలందిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి భవన నిర్మాణాలు పూర్తి చేయాలి.

– కిలపర్తి పరిదేశినాయుడు, ఎంపీటీసీ సభ్యుడు, పెదరావుపల్లి

పట్టించుకోని ప్రభుత్వం..



ప్రజారోగ్యాన్ని కూటమి ప్రభుత్వం కనీసం పట్టించుకోవడం లేదు. నియోజకవర్గంలోని పీహెచ్‌సీల్లో కనీస సౌకర్యాలు లేవు. అసంపూర్ణంగా నిలిచిపోయిన నిర్మాణాలను పూర్తిచేయడంలో కూటమి ప్రభుత్వం ఎందుకు నిర్లక్ష్యం చేస్తుందో అర్థం కావడం లేదు. నాయకులు స్పందించి నిర్మాణాలు పూర్తి చేయాలి.

–గాడి అప్పారావు, సీఐటీయూ నాయకుడు

పెండింగ్‌లో రూ. 2 కోట్ల బిల్లులు..

లక్కవరపుకోట, జామి పీహెచ్‌సీ భవన నిర్మాణాలు 90 శాతానికి పైగా పూర్తయ్యాయి. మిగిలినవి 70 శాతానికి పైగా పూర్తయ్యాయి. ఇంతలో ఎన్నికల కోడ్ రావడంతో బిల్లుల చెల్లింపులు నిలిపోయాయి. సుమారుగా రెండు కోట్ల రూపాయల బిల్లులు రావాల్సి ఉంది. నిలిచిపోయిన నిర్మాణాలపై కొత్త ప్రభుత్వం ఎటువంటి ఆదేశాలు ఇవ్వలేదు.

– శ్రీనివాసరావు, డీఈ, ఆర్అండ్‌బీ

సాగునీటి సమస్య పరిష్కరించండి

- ఎమ్మెల్యేకు రైతుల వినతి



ఎమ్మెల్యే కళావెంకటరావుకు సాగునీటి సమస్య వివరిస్తున్న రైతులు

చీపురుపల్లి: సాగునీరు విడుదల కాక.. చెరువు పనులు జరగకపోవడంతో సాగునీటి సమస్య ఎదుర్కొంటున్నామని చీపురుపల్లి మేజర్ పంచాయతీ పరిధిలోని సుమిత్రాపురం రెవెన్యూ పరిధి రైతులు తెలిపారు. ఈ మేరకు స్థానిక ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావును సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. సుమిత్రాపురం పంట పొలాలకు నారప్ప చెరువు నుంచి సాగునీరు అందేదన్నారు. ఆ చెరువు మధ్యలోనుంచి గజపతినగరం బ్రాంచ్ కెనాల్ పనుల్లో భాగంగా కాలువ తవ్వకాలు జరిగాయని తెలిపారు. అయితే బ్రాంచ్ కెనాల్ ద్వారా కనీసం నీరు అందుతుందనుకుంటే ఇటు కాలువ నీరు లేక అటు చెరువులో నీరు లేక ఇబ్బందులు పడుతున్నట్లు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు.

పింఛన్ల పంపిణీ..

అంతకుముందు చీపురుపల్లి మేజర్ పంచాయతీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే కళావెంకటరావు పింఛన్లు పంపిణీ చేశారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం సమీపంలో అన్న క్యాంటీన్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు రౌతు కామునాయుడు, దన్నాన రామచంద్రుడు, విజనగిరి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

చేతులను శుభ్రం చేసుకోవాలి



విద్యార్థిని పరీక్షిస్తున్న వైద్యాధికారి అజిత్‌బాబు

మెరకముడిదాం: భోజనం చేసేముందు ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా చేతులు శుభ్రం చేసుకోవాలని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి కె.అజిత్‌బాబు సూచించారు. మండలంలోని సాతాంవలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆయన తన సిబ్బందితో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా వంటగది, మరుగుదొడ్లు, తరగతి గదులను పరిశీలించారు. విద్యార్థులకు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆరోగ్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రధాన రహదారి పనులపై సమీక్ష



పనులపై సమీక్షిస్తున్న ఎమ్మెల్యే లలితకుమారి

శృంగవరపుకోట: ఎస్.కోట ప్రధాన రహదరి విస్తరణ, డ్రెయిన్ల నిర్మాణ పనులపై ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కలెక్టర్ అంబేడ్కర్ రూ.65 లక్షల నిధులు విడుదల చేయడంతో మొత్తం కోటి రూపాయల నిధులు సిద్ధంగా ఉన్నాయని, వెంటనే పనులు చేపట్టాలని ఆదేశించారు. పనులు చేపడుతున్న కాంట్రాక్టర్, మాజీ ఎంపీపీ రెడ్డి వెంకన్న మాట్లాడుతూ.. డ్రెయిన్ల నిర్మాణం ఇబ్బందిగా మారిందని, ఆక్రమణదారులు రోజుకో తగాదాతో ఇబ్బంది పెడుతున్నారని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. అధికారులు దగ్గరుండి ఆక్రమణలను తొలగిస్తే పనులు చేపడతామని చెప్పారు. దీంతో ఎమ్మెల్యే స్పందిస్తూ ఉదాసీనంగా వ్యవహరించకుండా పనులు జరిగేలా చూడాలని ఈఓ అనురాధను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సతీష్, తహసీల్దార్ శ్రీనివాసరావు, పీఆర్ జేఈ సత్యనారాయణ, టీడీపీ నాయకులు ఆర్.చంద్రశేఖర్, జె.రామసత్యం, చెక్కా కిరణ్, పి.రాజు, తదితరులు పాల్గొన్నారు.

గరివిడిలో భారీ వర్షం



చెరువును తలపిస్తున్న గర్భాం రోడ్డు

చీపురుపల్లి రూరల్ (గరివిడి): గరివిడి మండల కేంద్రంలో సోమవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. మూడు గంటల నుంచి నాలుగు వరకు ఎడతెరిపి లేని వర్షం పడడంతో గరివిడి – గర్భాం ప్రధాన రహదారి చెరువును తలపించింది. అలాగే వీపీ రేగ సమీపంలో వంతెన పైనుంచి వర్షపు నీరు ప్రవహించడంతో రాకపోకలకు ప్రజలు ఇబ్బంది పడ్డారు.

పింఛన్ల పంపిణీ

దత్తిరాజేరు: మండలంలోని కె. కృష్ణాపురంలో మంత్రి కొండపల్లి శ్రీనివాస్, పలువురు అధికార కే క్రిష్టాపురంలో సోమవారం ఉదయం మంత్రి కొండపల్లి శ్రీనువాస్ అధికారులతో కలసి లబ్ధిదారులకు పించన్లు పంపిణీ చేసారు.అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లాలలో 117 కోట్లు సామాజిక పింఛనులు కోసం వెచ్చిస్తున్నామని అన్నారు. వితంతు పింఛన్లు కొత్తగా మంజూరు చేయలేదని,50 ఏళ్లు దాటిన వారికి పింఛన్లు ఎప్పుడు ఇస్తారని,ఎరువులు సక్రమంగా అందలేదని గ్రామంలో మంత్రిని నిలదీసారు.ఈకార్యక్రమంలో ఇన్చార్జ్ ఎంపిడీఓ శివాజీ,తహశీల్దార్ విజయభాస్కర్,పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

రోడ్డున పడ్డాం..

- ప్రభుత్వం తీరును నిరసిస్తూ ఆటో డ్రైవర్ల ఆందోళన





ఎస్.కోట దేవీ జంక్షన్‌లో మానవహారంగా ఏర్పడి నిరసన తెలుపుతున్న ఆటోడ్రైవర్లు (ఇన్‌సెట్లో) తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఆటోడ్రైవర్లు, యూనియన్ల నేతలు

శృంగవరపుకోట: కూటమి సర్కారు నోటి దగ్గర కూడు తీసేయడం వల్ల కుటుంబాలతో కలిసి రోడ్డున పడ్డామని ఆటోడ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు ప్రభుత్వం తీరును నిరసిస్తూ బొడ్డవర జంక్షన్, ఎస్.కోట ఆర్టీసీ కాంప్లెక్స్, ధర్మవరం, జామి, బొడ్డవర, లక్కవరపుకోట స్టాండ్లకు చెందిన సుమారు 200 మందికి పైగా ఆటోడ్రైవర్లు సోమవారం స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు నిరసన ర్యాలీ చేపట్టారు. దేవీ జంక్షన్‌లో మానవహారంగా ఏర్పడి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ శ్రీనివాసరావుకు అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ మండల కార్యదర్శి ఖండిపల్లి భీముడు మాట్లాడుతూ.. నెలకు రూ.6 వేల భృతితో పాటు జీఓ 21 రద్దు చేస్తుందని ఆశిస్తే కూటమి ప్రభుత్వం ఆటో డ్రైవర్లకు తీరని అన్యాయం చేసిందన్నారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎ.జగన్‌మోహనరావు మాట్లాడుతూ.. లైసెన్స్ రెన్యువల్, ఫిట్‌నెస్ సర్టిఫికెట్ల మంజూరు బాధ్యత ప్రైవేట్ సంస్థలకు అప్పగించడంతో డ్రైవర్లపై ఆర్థిక భారం పడుతోందని చెప్పారు. ప్రభుత్వం మహిళలకు ఉచిత ప్రయాణం హామీ అమలు చేయడం మంచిదే అయినప్పటికీ.. ఆటో, క్యాబ్ డ్రైవర్ల గురించి కూడా ఆలోచించాల్సి ఉందన్నారు. సీఐటీయూ అనుబంధ రాష్ట్ర ఆటో డ్రైవర్ల సంఘ సభ్యుడు సీహెచ్ ముత్యాలు, ఏఐటీయూసీ నేతలు మోపాడ మధు, వి.లక్ష్మీనారాయణ, మద్ది కృష్ణ, తదితరులు మాట్లాడుతూ.. డిగ్రీలు చదివి ప్రభుత్వంపై ఆధారపడకుండా స్వయం ఉపాధి కోసం ఆటోలు నడుపుకుంటున్న వారి పొట్ట గొట్టడం తగదన్నారు. కార్యక్రమంలో ఆటో స్టాండ్ల యూనియన్ లీడర్లు పిల్లా నరసింహస్వామి, బి.సురేష్, జి.కృష్ణం నాయుడు, ఆర్.సన్ని, ఎం.గోవింద, జయబాబు, ఎం.అప్పన్నదొర, కె.అప్పారావు, వెంకటసత్యం, ఎస్.అప్పారావు, దేముళ్ల, బి.పట్నాయక్, ఎస్.కృష్ణ, ఐఎస్ నాయుడు, దాలిబాబు, తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు భైరిపురం విద్యార్థిని



జాహ్నవిని అభినందిస్తున్న పీడీ సతీష్‌కుమార్

మెరకముడిదాం: మండలంలోని భైరిపురం బాదం పెంటయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న రెడ్డి జాహ్నవి జాతీయస్థాయి పరుగు పోటీలకు ఎంపికైంది. ఇటీవల నరసరావుపేటలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరచడంతో జాహ్నవిని అధికారులు జాతీయస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. సెప్టెంబర్ 4 వతేదీ నుంచి 7 వరకు బీహార్‌లో జరగనున్న జాతీయస్థాయి పోటీల్లో జాహ్నవి తలపడనుంది. ఈమేరకు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎస్ఎస్ఆర్ ఆచార్యులు, పీడీ సతీష్‌కుమార్, ఉపాధ్యాయులు, ఇతర సిబ్బంది జాహ్నవిని సోమవారం ప్రత్యేకంగా అభినందించారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ



లబ్ధిదారుకు చెక్కు అందజేస్తున్న మంత్రి శ్రీనివాస్

గజపతినగరం: మండల కేంద్రంలోని టీడీపీ కార్యాలయంలో పలువురు లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను మంత్రి కొండపల్లి శ్రీనివాసరావు సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో ఎక్కడా లేనివిధంగా మన రాష్ట్రంలోనే తొలిసారిగా ప్రజల వద్దకు పాలన కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు తీసుకొచ్చారన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ పీవీవీ గోపాలరాజు, పీఏసీఎస్ చైర్మన్ లెంక బంగారునాయుడు, గుంప్రోతు గోవిందరావు, కొండపల్లి భాస్కరరావు, ఎం.శ్రీధర్, ప్రదీప్‌కుమార్, చప్పా చంద్రశేఖర్, జానకిరామ్, రుంకాన అరుణ, బోని గోవిందరావు, తదితరులు పాల్గొన్నారు.

డ్రోన్ పిచికారీపై అవగాహన



డ్రోన్ పిచికారీపై రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏడీఏ నిర్మలాజ్యోతి, తదితరులు

గజపతినగరం: డ్రోన్ ద్వారా పురుగు మందుల పిచికారీపై మండల కేంద్రంలోని రైతులకు వ్యవసాయ శాఖ ఏడీఏ ఎ. నిర్మలాజ్యోతి ఆధ్వర్యంలో సిబ్బంది సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సాగులో ఆధునికయంత్రాల వినియోగంపై వివరించారు. కార్యక్రమంలో ఏఓ పి. కిరణ్ కుమార్, వీఏఏ అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రత పాటించాలి



కడకొండలో విద్యార్థిచే తెలుగ,ఆంగ్ల పదాలు చదివిస్తున్న ఎంఈఓ బాలబాస్కరావు

వేపాడ: ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం నిర్వహిస్తున్న కార్మికులు మెనూ అమలుచేయడంతో పాటు పరిశుభ్రత పాటించాలని ఎంఈఓ బాలభాస్కరరావు అన్నారు. మండలంలోని కడకొండ, చినదుంగాడ పాఠశాలలను సోమవారం ఆయన సందర్శించి ఉపాధ్యాయులు, విద్యార్థుల రిజిస్టర్లను పరిశీలించారు. అనంతరం మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు పలు సూచనలు చేశారు.

9,10 తేదీల్లో మెగా గ్రీవెన్స్‌సెల్

లక్కవరపుకోట: మండలంలో రీ సర్వే పూర్తికాని 20 రెవెన్యూ గ్రామాలకు సంబంధించి ఈ నెల 9,10 తేదీల్లో మెగా గ్రీవెన్స్‌సెల్ నిర్వహించనున్నట్లు తహసీల్దార్ కోరాడ శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. భూ సంబంధిత సమస్యలపై అర్జీలు సమర్పిస్తే పరిష్కరిస్తామని పేర్కొన్నారు. 9వ తేదీన కుద్దువలస, ఎల్.కోట తలారి, సీతారాంపురం, కిత్తన్నపేట, భీమాళి, ఖాసాపేట, కొట్యాడ, మార్లాపల్లి, కళ్లేపల్లి, రంగరాయపురం గ్రామాలకు.. 10న గనివాడ, నిడుగట్టు, మల్లివీడు, రేగ, లక్కవరపుకోట, వెంకన్నపాలెం, చందులూరు, తామరాపల్లి, గజపతినగరం గ్రామాలకు సంబంధించి వినతులు స్వీకరిస్తామని తెలిపారు.

త్రోబాల్ పోటీల్లో సత్తా చాటిన శ్రీను



బంగారు పతకంతో శ్రీను

కొత్తవలస: తమిళనాడు రాష్ట్రం కోయంబత్తూర్‌లో జరిగిన నాలుగో జాతీయస్థాయి త్రోబాల్ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ జట్టు ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ జట్టుకు వైస్ కెప్టెన్‌గా మండలంలోని గనిశెట్టిపాలెం గ్రామ సచివాలయం డిజిటల్ సహాయకుడు పాటిపురెడ్డి శ్రీను వ్యవహరించాడు. పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచినందుకు గాను ఇతనికి బంగారు పథకం వరించింది. ఈ మేరకు శ్రీనును ఎంపీపీ నీలంశెట్టి గోపమ్మ, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శ్రీదేవి, తదితరులు అభినందించారు.

నేడు వైఎస్సార్ వర్ధంతి

చీపురుపల్లి: దివంగత ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర్‌రెడ్డి వర్ధంతి మంగళవారం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇప్పిలి అనంతం, జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, మండల అధ్యక్షుడు మీసాల వరహాలనాయుడు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం ఉదయం 8 గంటలకు స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఉన్న మహానేత వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు, మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ పాల్గొంటారని.. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

విజయవంతం చేయండి..

శృంగవరపుకోట: రైతు బాంధవుడు, దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి వేడుకలను మంగళవారం నిర్వహించనున్నట్లు ఎస్.కోట నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ కన్వీనర్ కడుబండి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30 గంటలకు కొత్తవలసలో.. 10.30 గంటలకు ఎస్.కోటలో జరగనున్న కార్యక్రమాలకు ప్రతి ఒక్కరూ హాజరై విజయవంతం చేయాలని కోరారు.

బ్రహ్మాస్త్రంతో పురుగుల నివారణ

వేపాడ: వరిలో వచ్చే ఆకుముడత, రసం పీల్చు పురుగుల నివారణకు బ్రహ్మాస్త్రం కషాయం ఎంతో ఉపయోగపడుతుందని ప్రకృతి వ్యవసాయం మాస్టర్ ట్రైనర్ సన్యాసమ్మ అన్నారు. మండల కేంద్రంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది బ్రహ్మాస్త్రం తయారీపై సోమవారం అవగాహన కల్పించారు. సర్పంచ్ మిరపాక అర్జునమ్మ సమక్షంలో జరిగిన అవగాహన సదస్సుల్లో మాస్టర్ ట్రైనర్ సన్యాసమ్మ మాట్లాడుతూ.. పది లీటర్ల ఆవుమూత్రం, ఐదు రకాల చేదు, వగరు ఉన్న ఆకులు రెండు కిలోలు చొప్పున మొత్తం పది కిలోల ఆకులు మెత్తగా దంచి ఆవు మూత్రంలో వేసి మరిగించాలన్నారు. అలా వచ్చిన ద్రావణంమూడు లీటర్లను వంద లీటర్ల నీటిలో కలిపి ఎకరా పొలంలో పిచికారీ చేయలని సూచించారు.

విద్యుదాఘాతంతో పాడి గేదె మృతి

శృంగవరపుకోట: విద్యుత్‌శాఖ నిర్లక్ష్యానికి ఓ జీవం బలైపోయింది. మండలంలో రేవళ్లపాలెంలో సోమవారం ఈ సంఘటన చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన బండారు అప్పారావు తన పశువులను మేతకు తోలుకెళ్లగా.. పక్కనే మూడడుగుల ఎత్తులో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ తగిలి గేదె అక్కడికక్కడే మృతి చెందింది. దీంతో బాధిత రైతు కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.